

అది పరువు హత్యేనా?
గండికోటలో సంచలనం సృష్టించిన బాలిక హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించినట్లు తెలిసింది. నిందితులను గుర్తించినట్లు సమాచారం. -10లో



ఇలాగైతే ఎలా'గండి'!
శ్రావణ మాస ఉత్సవాల సందర్భంగా గండి వీరాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో యేటా వేసే జర్మన్ షెడ్డు ఈసారి సమస్యగా మారింది. -10లో

గరిష్టం/కనిష్టం
30.9/24.4
వాతావరణం
జిల్లాలో సోమవారం 24.4 – 30.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.0 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

వైభవం..పల్లకీ ఉత్సవం

రాయచోటి టౌన్: రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి పల్లకీలో ఊరేగారు. సోమవారం రాత్రి స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను రంగు రంగులపూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించి ఊరేగించారు.

జైళ్లశాఖ ఎఫ్ఏసీ డీఐజీగా రవి కిరణ్

కడప అర్బన్: రాయలసీమ జైళ్ల శాఖ ఫుల్ అడిషనల్ చార్జ్ డీఐజీగా రవికిరణ్‌ను నియమిస్తూ డీజీ అంజనీ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత డీఐజీ, కడప సెంట్రల్ జైలు పర్యవేక్షణ అధికారిగా ఉన్న రాజేశ్వర రావును తొలగిస్తూ రవి కిరణ్‌కు పూర్తి బాధ్యతలను అప్పగించారు.

పచ్చిరొట్టతో భూసారం మెరుగు

కడప సెవెన్‌రోడ్స్: రైతులు పచ్చిరొట్ట ఎరువులను వినియోగించడం వల్ల భూసారం మెరుగవుతుందని ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో 'పచ్చిరొట్ట ఎరువుతో మట్టికి జీవం'అనే వాల్ పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఈ ఎరువుల వల్ల నీటి నిలుపుదల సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు. మొక్కలు వేగంగా పెరగడం వల్ల కలుపు మొక్కల పెరుగుదల తగ్గుతుందన్నారు.

నిధులు మంజూరు

రాజుపాళెం: మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాలలోని శ్రీచెన్నకేశవ ఆలయ పునఃనిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరైనట్లు దేవదాయశాఖ ఉత్తర్వులు వచ్చాయి. దేవాదాయ శాఖ సీజీఎఫ్ నిధుల కింద రూ.3.20 కోట్లు, ఆలయ కాంట్రిబ్యూషన్ రూ.80 లక్షలతో ఈ నిధులు మంజూరు చేశారు. ఇప్పటికే శ్రీసంజీవరాయ స్వామి ఆలయ నిర్మాణానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.3.55 కోట్లు నిధులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించారు. ఈ రెండు ఆలయాలు నిర్మాణాలు పూర్తయితే వెల్లాల పుణ్యక్షేత్రం మరింత శోభాయమానం కానుంది.

ఇంటర్ విద్య బలోపేతానికి కృషి



ఆర్ఐఓగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో ఇంటర్ విద్య బలోపేతానికి కృషి చేస్తానని ఆర్ఐవో (ఎఫ్ఏసీ)గా బాధ్యతలు చేపట్టిన వేంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఆర్ఐవో కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆర్ఐవోగా పనిచేసిన వెంకటసుబ్బయ్య నంద్యాల జిల్లా కొలిమిగుంట్ల ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీపై వెళ్లారు.

ఇదేనా.. మీ రైతు సేవ!

- కూటమి ప్రభుత్వ తీరుపై మండిపడ్డ వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి
- 11 దాటినా రైతు సేవా కేంద్రం తెరవకపోవడంపై అసహనం
- రాష్ట్రంలోనే తొలిసారిగా ఇంటిటా చంద్రబాబూ ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ



అనిమెలలో 11 దాటినా తెరవని రైతు సేవా కేంద్రాన్ని సందర్శించిన రవీంద్రనాథ్‌రెడ్డి, నరేన్ రామాంజుల రెడ్డి

వీరపునాయునిపల్లె: ఎరువులకు బరువు పడాల్సిన అవసరమే ఉండేది కాదు.. పైరుకు పురుగు మందుల కోసం ఊరు దాటాల్సిన పనే లేదు.. ఇక విత్తనాలంటారా.. ఊరి ముంగిట్లోనే దొరికేవి.. క్రాప్ ఇన్సూరెన్స్ చేయాలన్నా.. ఇన్‌పుట్ సబ్సిడీ కావాలన్నా ఆ కార్యాలయం గడప తొక్కితే చాలు నిమిషాల్లో పనయిపోయేది. ఇదంతా రైతు భరోసా కేంద్రం అందించిన సేవ గురించే. వైఎస్సార్ సీపీ హయాంలో ఓ వెలుగు వెలిగిన ఆర్‌బీకేలు కూటమి ప్రభుత్వంతో కొట్టుమిట్టాడుతున్నాయి. ఒకప్పుడు అటు అధికారులతో.. ఇటు రైతన్నలతో నిత్యం కళకళలాడే ఆర్‌బీకేలు నేడు వెలవెలబోతున్నాయి. దీనికి వీరపునాయునిపల్లె మండలం అనిమెల రైతుభరోసా కేంద్రమే నిలువెత్తు నిదర్శనం.

● చంద్రబాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోనే తొలిసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరేన్ రామాంజుల రెడ్డి సోమవారం అనిమెలలో పర్యటించారు. ఈ మేరకు స్థానికులు రైతు సేవా కేంద్ర దుస్థితి గురించి వివరించారు. 'ఏ అధికారి ఎప్పుడొస్తారో.. ఎన్నింటికి తలుపు తెరుస్తారో తెలీదు.. రైతులకు అవసరమైన సామగ్రి అందుబాటులో ఉండదు..'అంటూ వాపోయారు. స్పందించిన రవీంద్రనాథ్‌రెడ్డి, నరేన్ స్థానిక నేతలతో కలిసి రైతు సేవా కేంద్రం వద్దకు వెళ్లి పరిశీలించారు. అప్పటికే ఉదయం 11 దాటింది.. కార్యాలయ తలుపులే తెరవలేదు.

రైతు సంక్షేమం పట్టని ప్రభుత్వం..

వ్యవసాయ సిబ్బంది నిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలన్న సంకల్పంతో జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారని రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం ఆర్‌బీకేల లక్ష్యాన్ని నీరుకారుస్తోందన్నారు. దాదాపు 11గంటలు అవుతున్నా ఇంతవరకు కార్యాలయం తెరవకపోవడంపై మండిపడ్డారు. రైతులను అన్ని విధాలా ఆదుకొంటామని చెబుతున్న ప్రభుత్వం రైతులకు అవసరమైన విత్తనాలు, పురుగు మందులు అందుబాటులో ఎందుకు ఉంచడం లేదని ప్రశ్నించారు. దీన్ని బట్టి చూస్తే రైతుల మీద కూటమి ప్రభుత్వానికి ఎంత చిత్త శుద్ధి ఉందో అర్థమవుతుందన్నారు.

కాస్త ఆలస్యమయిందంతే..

ఈ విషయమై మండల వ్యవసాయాధికారిని ప్రశ్నించగా.. అనిమెల రైతు సేవా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వ్యవసాయ సహాయకుడు బదిలీపై వెళ్లాడని ఇక్కడికి ఇంకా ఎవరూ రాలేదన్నారు. ప్రస్తుతానికి అలిదెన రైతు సేవా కేంద్రం సహాయకుడు భాషాను ఇన్‌చార్జ్‌గా నియమించామని.. రావడం కాస్త ఆలస్యమయిందని పేర్కొన్నారు.

ఎరువులను అందుబాటులో ఉంచాలి



గత ప్రభుత్వం రైతుల అవసరాలను గుర్తించి కావల్సిన ఎరువులు, విత్తనాలు ముందుగానే నిలువ ఉంచి సకాలంలో రైతులకు అందించేది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం రైతుల అవసరాలు గుర్తించడంలో పూర్తిగా విఫలమయింది. ఇంత వరకు రైతు సేవా కేంద్రంలో విత్తనాలుగాని ఎరువులుగాని ఉంచలేదు. సిబ్బంది కూడా అందుబాటులో ఉండడం లేదు.
–శివాంజనేయరెడ్డి, రైతు, అనిమెల

వంచన, మోసం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మోసం చేయడం, వంచనకు గురిచేయడం రెండూ వెన్నతో పెట్టిన విద్య అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. సోమవారం కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరేన్ రామాంజుల రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని అనిమెలలో చంద్రబాబు ష్యూరిటీ మోసానికి గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి గతంలో జగన్‌మోహన్ రెడ్డి అందించిన పాలనకు ప్రస్తుతం చంద్రబాబు అందిస్తున్న అరాచక పాలనకు ఉన్న తేడాను వారికి వివరించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందించాడని చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత అర్హత ఉన్నవారికి కూడా సంక్షేమ పథకాలు రద్దు చేసిన విషయాన్ని వారికి తెలియజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాతూ ఎన్నికలకు ముందు బాబు హామీల వర్షం కురిపించారు. అధికారంలోకి రాగానే హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాడన్నారు. ప్రతి వైఎస్సార్ సీపీ కార్యకర్త సైనికుడిలా పని చేసి కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. మండల కన్వీనర్ రఘునాథ రెడ్డి, మైనింగ్ మాజీ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, అనిమెల సర్పంచు నరేష్‌రెడ్డి, ఎంపీటీసీ రాఘవ యాదవ్, సంగమేశ్వర దేవస్థానం మాజీ చైర్మెన్ శివాంజనేయరెడ్డి, రైతు నాయకుడు భాస్కర్‌రెడ్డి, కమలాపురం నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రవి, శ్రీనివాసుల్‌రెడ్డి, శంబురెడ్డి పాల్గొన్నారు.



కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న మోసాలను ప్రజలకు వివరిస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి, నరేన్ రామాంజుల రెడ్డి

అక్రమ కేసులతో పోరాటాలను ఆపలేరు

- ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి
- ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును నిరసిస్తూ బద్వేలులో ర్యాలీ



ఆందోళన నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ తదితరులు

బద్వేలు అర్బన్: ఎన్ని అక్రమ కేసులు బనాయించినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజల పక్షాన చేసే పోరాటాలను ఆపలేరని, అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదని ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి అన్నారు. రాజంపేట ఎంపీ పి.వి.మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును నిరసిస్తూ సోమవారం స్థానిక నెల్లూరు రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి బైపాస్‌రోడ్డులోని వైఎస్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం శాంతియుత ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రశ్నించే గొంతుకలను అణచివేయాలని చూస్తోందని మండిపడ్డారు. లిక్కర్ కుంభకోణంలో ఎంపీ మిథున్ రెడ్డి పాత్ర ఉన్నట్లు నిరూపించే ఒక్క ఆధారం కూడా పోలీసుల వద్ద లేకపోయినప్పటికీ కేవలం పెద్దిరెడ్డి కుటుంబం వైఎస్‌జగన్‌కి అండగా ఉంటుందన్న కారణంతోనే అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేశారన్నారు.

ధైర్యంగా ఉండండి.. పార్టీ అండగా ఉంటుంది

రమేష్‌కుమార్‌రెడ్డిని ఫోన్‌లో పరామర్శించిన మాజీ సీఎం వైఎస్ జగన్

సాక్షి, రాయచోటి: అధికార పార్టీ పెట్టే అక్రమ కేసులు, దౌర్జన్యాలకు భయపడవద్దని.. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఎప్పుడూ మీకు అండగా ఉంటుందని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. అందుకు సంబంధించి సోమవారం మధ్యాహ్నం మదనపల్లె పోలీసుస్టేషన్‌లో ఉన్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డిని మాజీ సీఎం వైఎస్ జగన్ ఫోన్‌లో పరామర్శించారు. ఈ సందర్భంగా కూటమి సర్కార్ ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అందరం తోడుగా ఉంటామని పేర్కొన్నారు. ప్రతి దానికి చెల్లింపులుంటాయని, ధైర్యంగా ముందుకు సాగాలని వైఎస్ జగన్ సూచించారు.

● రమేష్‌కుమార్‌రెడ్డి సోమవారం సాయంత్రం స్టేషన్ బెయిలుపై విడుదలయ్యారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు, మంత్రి రాంప్రసాద్‌రెడ్డిలపై చేసిన రాజకీయ విమర్శలను సాకుగా చూపి ఆదివారం రమేష్‌కుమార్ రెడ్డిని అదుపులోకి తీసుకున్న విషయం విదితమే.



రమేష్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

అక్రమాల గుట్టు.. తిరుమలేశుడికెరుక!

- మహానాడు సందర్భంగా విద్యాసంస్థల నుంచి లక్షల్లో వసూలు
- సస్పెండ్ చేయాలని అధిష్టానం నుంచి ఆదేశాలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: తెలుగునాడు విద్యార్థి సంఘం(టీఎన్‌ఎస్‌ఎఫ్) పేరు చెప్పుకొని ఆ విద్యార్థి నాయకుడు ఎగిరెగిరి పడ్డాడు. కాంగ్రెస్ పార్టీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి వలస వచ్చిన ఆ ఛోటా నాయకుడి పేరు అనతి కాలంలోనే అందరి నోళ్లలో నానింది. ఇదే అదునుగా అనేక అక్రమాలు, దౌర్జన్యా లకు పాల్పడుతూ అక్రమ వసూళ్లకు తెరలేపాడు. చివరికి సొంత పార్టీ నేతల విద్యా సంస్థల నుంచే డబ్బు వసూలు చేసేందుకు సాహసించి అడ్డంగా బుక్కయ్యాడు. దీంతో అతన్ని సస్పెండ్ చేయాలని పార్టీ అధిష్టానం సూచించినట్లు తెలుస్తోంది. అతని నిజస్వరూపం బయటపడటంతో పార్టీ నేతలు కూడా అతన్ని పిలిపించి మందలించగా తానే రాజీనామా చేస్తానని చెప్పినట్లు తెలుస్తోంది.


వివరాలిలా ఉన్నాయి....

జిల్లా కాంగ్రెస్ పార్టీలో ఎన్‌ఎస్‌యూఐలో పని చేసిన ఓ విద్యార్థి నాయకుడు 2024 ఎన్నికల ముందు తెలుగుదేశం పార్టీలో చేరాడు. చూసి రమ్మంటే కాల్చివచ్చే అతని దుడుకు స్వభావాన్ని గమనించిన కడప ఎమ్మెల్యే మాధవి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అతన్ని ప్రతిపక్ష పార్టీ నాయకులపై ఉసిగొల్పారు. అతను కూడా ఎమ్మెల్యేకు తాను తప్పా మరెవరూ విశ్వాసపాత్రుడు లేదన్న రీతిలో వ్యవహరించాడు. ఈ క్రమంలో మేయర్ సురేష్ బాబు ఇంటిపై చెత్త వేయించిన ఘటనలో... కార్పొరేషన్‌లో సర్వసభ్య సమావేశం జరిగిన ప్రతీసారి కార్పొరేషన్ కార్యాలయం సమీపంలో నాయకులను వెంటేసుకొని హంగామా చేయడం ద్వారా అందరి దృష్టిలో పడ్డాడు. ఇంతలోనే కడపలో మహానాడు నిర్వహించాలని ఆ పార్టీ అధిష్టానం నిర్ణయించడంతో ఆ నాయకుడు ఇదే అదునుగా భావించి అక్రమ వసూళ్లకు తెరలేపాడు. ప్రతి విద్యాసంస్థ నుంచి లక్ష నుంచి రూ.2లక్షల వరకూ వసూలు చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. వెళ్లిన ప్రతిచోటా కడప ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసులరెడ్డి పేరు చెప్పడంతో విద్యాసంస్థల యాజమాన్యాలు కూడా భయపడి అడిగినంతా సమర్పించుకున్నట్లు తెలిసింది. పనిలో పనిగా నారాయణ విద్యాసంస్థల నుంచి కూడా వసూలు చేసేందుకు విఫలయత్నం చేసినట్లు సమాచారం. ఈ విషయం మంత్రి నారాయణకు తెలియడంతో జిల్లా పార్టీ నేతలపై ఆయన సీరియస్ అయినట్లు తెలిసింది. ఈ మేరకు అతన్ని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని అధిష్టానంతో చెప్పించగా, జిల్లా పార్టీ నేతలు కూడా అతన్ని పిలిపించి తీవ్రంగా మందలించినట్లు తెలుస్తోంది. దీంతో చేసేదేమీ లేక తానే రాజీనామా చేస్తానని చెప్పి బయటపడిన ఆ విద్యార్థి నాయకుడు అప్పటి నుంచి ముఖం చాటేశాడు. దీనివెనుక ఏం జరిగిందనే వివరాలు బయటికి రాకుండా జిల్లా పార్టీ ముఖ్యనేత తొక్కిపెట్టినట్లు తెలిసింది.

హైవే.. ఇక హైస్పీడ్‌వే

- కడప-రేణిగుంట హైవేకు వన్యప్రాణి పచ్చజెండా!
- 122 కిలోమీటర్ల ఫోర్‌లైన్
- ఇక పనులే ప్రారంభం
- వన్యప్రాణుల సంచారం కోసం 11చోట్ల వంతెనలు





రాజంపేట: శేషాచలం అటవీ ప్రాంతంలోపచ్చటి ప్రకృతి ఒడిలో ఆహ్లాదకరమైన ప్రయాణం కల్పించే కడప-రేణిగుంట హైవేకు వైల్డ్‌లైఫ్ (వన్యప్రాణి సంరక్షణవిభాగం) పచ్చజెండా ఊపింది. రాజంపేట నియోజకవర్గం, సిద్దవటం మండలం భాకరాపేట వద్ద ఉన్న పెద్దపల్లి, రైల్వేకోడూరు మండలంలోని శెట్టిగుంట వద్ద టోల్‌ప్లాజా నిర్మితం చేయనున్నారు.

సోలాపూర్-చెన్నై జాతీయరహదారిలో..

సోలాపూర్-కర్నూలు-చెన్నై జాతీయరహదారి (716)లో ఆంధ్రప్రదేశ్‌లో 329 కిలోమీటర్ల మేర విస్తరించారు. ఇందులో కడప -రేణిగుంట వరకు 122 కిలోమీటర్ల దూరం నాలుగు వరుసలుగా విస్తరించేలా ప్రాజెక్టు మంజూరైంది. అటవీశాఖ , పర్యావరణ అనమతులు గత డిసెంబరులో వచ్చాయి. వైల్డ్‌లైఫ్(వన్యప్రాణి సంరక్షణ విభాగం) అనుమతులు ఇస్తూ కేంద్రం ఇటీవల నిర్ణయం తీసుకుంది. దీంతో త్వరలో పనులు ప్రారంభంకానున్నాయి.

రూ.3,232 కోట్లతో..

రూ.3,232 కోట్లతో చేపట్టనున్న కడప-రేణిగుంట హైవేను లక్ష్మీ ఇన్‌ఫ్రా సంస్థ దక్కించుకున్న సంగతి తెలిసిందే, ఇప్పటికే లక్ష్మీ ఇన్‌ఫ్రా సంస్థ నిర్మాణపనులకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసుకుంది. పనులు ప్రారంభించేలా ఎన్‌హెచ్‌ఏఐ అపాయింటెడ్ డేట్‌ను త్వరలో ఖరారు చేయనుంది. అప్పటి నుంచి రెండేళ్లలో హైవే పనులు పూర్తి చేయాల్సి ఉంది.

తక్కువ వ్యవధిలోనే తిరుపతి..

కడప-రేణిగుంట ఎన్‌హెచ్ ఏర్పడిన తర్వాత తక్కువ వ్యవధిలో తిరుపతికి చేరుకునే పరిస్థితులు ఆవిష్కృతమవుతాయి. ఫలితంగా మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాల నుంచి పుణ్యక్షేత్రమైన తిరుపతి, చెన్నై నగరాలకు వెళ్లే వారికి కడప-రేణిగుంట రహదారి ఎన్‌హెచ్ చేయడం వల్ల త్వరితగతిన గమ్యానికి చేరుకునే వీలు కలుగుతుంది.

ఎంపీ మిథున్‌రెడ్డి కృషి

కడప-రేణిగుంట నేషనల్ హైవే త్వరితగతిన నిర్మితం అయ్యేందుకు వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథునరెడ్డి కృషి చేశారు. కేంద్రం తీసుకున్న ప్రయార్టీలో కడప-రేణిగుంట ఎన్‌హెచ్‌ను చేర్చేలా ప్రయత్నాలు చేశారు. ఫలితంగా భూసేకరణతోపాటు, మరో వైపు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. రెండేళ్ల లక్ష్యంగా ఎన్‌హెచ్‌ను అందుబాటులోకి తీసుకురావాలన్నదే అభిమతంగా ఎంపీ కృషి చేశారు.

82 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్..

కడప-రేణిగుంట నేషనల్ హైవేలో 82 కిలోమీటర్ల దూరం గ్రీన్‌ఫీల్డ్‌రోడ్‌గా పరిగణలోకి తీసుకున్నారు. కడప, అన్నమయ్య, తిరుపతి జిల్లాల పరిధిలో 122 కిలోమీటర్ల హైవే కొనసాగుతుంది. కడప నుంచి భాకరాపేట వరకు ఇప్పుడున్న రెండువరసల దారిని నాలుగు వరసలుగా మార్చుతారు. భాకరాపేట నుంచి రైల్వేకోడూరు అవతల శెట్టిగుంట వరకు 82 కిలోమీటర్ల మేర కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ రహదారిని నిర్మించనున్నారు. శెట్టిగుంట నుంచే రేణిగుంట సమీపంలో ప్రస్తుతం ఉన్న హైవేను ఫోర్‌లైన్‌గా మార్చనున్నారు. రేణిగుంట వద్ద బైపాస్ 3.5 కిలోమీటర్ల మేర నిర్మించనున్నారు. ఈ హైవే ప్రాజెక్టు రెండు ప్యాకేజీలుగా విభించారు. కడప నుంచి చిన్నఓరంపాడు వరకు 64 కిలోమీటర్లు తొలి ప్యాకేజీగా, విభించారు. చిన్నఓరంపాడు నుంచి రేణిగుంట వరకు 58 కిలో మీటర్ల దూరాన్ని రెండో ప్యాకేజి కిందికి తీసుకొచ్చారు.

వన్యప్రాణులు సంచరించేలా..



గ్రీన్‌ఫీల్డ్ హైవే కొంత భాగం అటవీ ప్రాంతంలో వెళ్లాల్సి ఉంది. అందువల్ల ఒకటిన్నర మీటర్ ఎత్తులో హైవే నిర్మాణం చేపట్టనున్నారు. వన్యప్రాణాణులు సంచరించేందుకు వీలుగా ఈ హైవే 5.5 కిలోమీటర్ల మేరకు 11 చోట్ల వంతెనలు నిర్మించనున్నారు. దీని వల్ల వంతెనలపై నుంచి వాహనాలు రాకపోకలు వెళ్లేలా డిజైన్ చేశారు. వంతెనల కింద భాగంలో వన్యప్రాణులు రాకపోకలు కొనసాగించేందుకు సౌకర్యం కల్పించనున్నారు.



హైవే వెళ్లే శేషాచలం అటవీ ప్రాంతం

తగ్గనున్న ట్రాఫిక్..



ప్రస్తుత కడప-రేణిగుంట హైవేలో రోజురోజుకు ట్రాఫిక్ పెరుగుతోంది. ఈ మార్గం మీదుగా తిరుపతి, చెన్నై, ముంబై, హైదరాబాద్ మధ్య రాకపోకలు సాగిస్తున్నాయి. నిత్యం 17వేలకు పైగా వాహనాలు హైవేపై పరుగులు తీస్తున్నాయి. ఈ ట్రాఫిక్‌కు ప్రస్తుతం ఉన్న హైవే కెపాసిటీ సరిపోవడంలేదు. ఫలితంగా ట్రాఫిక్ స్తంభిస్తోంది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.అంతేగాకుండా కడప-రేణిగుంట రోడ్డు ప్రయాణం మూడు నుంచి నాలుగు గంటలకుపైగా పడుతోంది. సకాలంలో గమ్యాలకు చేరలేని పరిస్థితి. నాలుగులైన్ల రోడ్డు నిర్మాణంతో ట్రాఫిక్ తగ్గుతుంది. సర్వీసు రోడ్డుగా మారనుండటంతో ప్రమాదాలు తగ్గుముఖం పడతాయి.

జిల్లా అంతటా వర్షం

- ఆరుతడి పంటలకు జీవం
- కాశినాయన మండలంలో అత్యధికంగా 55 మి.మీ వర్షం



పెండ్లిమర్రి ప్రాంతంలో సాగులో వేరుశనగ

కడప అగ్రికల్చర్: హమ్మయ్యా.. వరుణుడు కరుణించాడు. ఖరీఫ్ సీజన్‌కు ముందే పలకరించిన వరుణుడు ఆపై ముఖం చాటేశాడు. దీంతో సాగు చేసిన ఆరుతడి పంటలు ఎండముఖం పట్టాయి. రైతుల్లో ఆందోళన మొదలైంది. దాదాపు జిల్లాలో కరువుఛాయలు అలుముకున్నాయి. ఈ తరుణంలో అల్పపీడనం కారణంగా రెండు రోజుల నుంచి జిల్లాలో అక్కడక్కడ చిరుజల్లులు పడతూ వచ్చాయి. ఇక ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో వర్షం కురిసింది. ఫలితంగా ఆరుతడి పంటలకు ప్రాణం పోసినట్లయింది. జిల్లాలో ప్రస్తుతం వేరుశనగ, కంది, పసుపు, మినుము వంటి ఆరుతడి పంటల సాగుకు అదును ఇదేనని వ్యవసాయ అధికారులు తెలిపారు. ప్రస్తుతం కురిసిన వర్షంతోపాటు ఇంకా రెండు రోజుల పాటు జిల్లాలో వర్షాలు పడే అవకాశం ఉంది. దీంతోపాటు గతంలో సాగుచేసిన ఆరుతడి పంటలకు కూడా ఈవర్షం ఎంతో మేలని వ్యవసాయ అధికారులు తెలిపారు.

కేసీ కాలువ నీటికితోడు...

జిల్లావ్యాప్తంగా ఇటీవల అధికారులు జీలుగలు, జనుములు, పెసలను పంపిణీ చేశారు. దీంతో చాలామంది రైతులు ప్రస్తుతం కురిసిన వర్షంతో వాటిని సత్తువ పంట కింద సాగు చేయనున్నారు. దీనికితోడు కేసీ కాలువకు నీరు కూడా విడుదలైయింది. ఇక కేసీ రైతులు సాగు పనులను ఆరంభించనున్నారు. ఇప్పటికే చాలా మంది రైతులు కేసీ కెనాల్ కింద నారుమడులను సాగు చేస్తున్నారు. ఈ కేసీ నీటికి తోడుగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు రైతులకు మేలు జరగనుంది.

జిల్లాలో 7 వేల హెక్టార్లలో పంటలసాగు...

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాలో ఇప్పటికే దాదాపు 7 వేల హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేశారు.ఇందులో 16 వందల హెక్టార్లలో వరి, 717 హెక్టార్లలో మొక్కజొన్న, 827 హెక్టార్లలో మినుము, 871 హెక్టార్లలో వేరుశనగ, 70 హెక్టార్లలో పొద్దుతిరుగుడు, 358 హెక్టార్లలో సజ్జ, 30 హెక్టార్లలో సోయాబీన్, 2658 హెక్టార్లలో పత్తి, 16 హెక్టార్లలో చెరకు ఇలా జిల్లావ్యాప్తంగా 7 వేల హెక్టార్లలో వివిధ ఆరుతడి పంటలు సాగయ్యాయి.



● అల్పపీడనం కారణంగా జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లో వర్షం కురిసింది. ఈ వర్షం ఆరుతడి పంటలకు ఎంతో మేలు. ప్రస్తుతం కేసీ కెనాల్‌కు నీరు వస్తోంది.ఇప్పటికే చాలామంది రైతులు నారుమడులను సాగు చేస్తున్నారు. – చంద్రానాయక్, జిల్లా వ్యవసాయ అధికారి

మండలం	కురిసిన వర్షం(మి.మీ)	మండలం	కురిసిన వర్షం(మి.మీ)
కాశినాయన	55	జమ్మలమడుగు	15.4
మైదుకూరు	44.6	పెండ్లిమర్రి	15.2
పోరుమామిళ్ల	42.4	కడప	14.4
సిద్దవటం	41.8	వీఎన్‌పల్లి	14.2
ఖాజీపేట	41.2	మైలవరం	14.2
చాపాడు	36.4	బి.మఠం	14.2
చెన్నూరు	35.6	సికెదిన్నె	13.4
కలసపాడు	32.2	రాజుపాలెం	13.2
వల్లూరు	27.4	వేంపల్లి	10.2
అట్లూరు	25.8	చక్రాయపేట	10.2
పొద్దుటూరు	24.2	వేముల	10.2
ఎర్రగుంట్ల	24.0	బికోడూరు	8.6
దువ్వూరు	22.4	బద్వేల్	8.4
కమలాపురం	20.4	ముద్దనూరు	6.4
ఒంటిమిట్ట	18.6	పులివెందుల	4.0
తొండూరు	17.2	కొండాపురం	2.8

క్లుప్తంగా

బైకు అదుపుతప్పి యువకుడి మృతి


మృతి చెందిన శ్రీరాములు

కాశినాయన : మండలంలోని వంకమర్రి గ్రామం వద్ద బైక్‌పై వెళుతున్న ఇద్దరు యువకులు అదుపు తప్పి కిందపడగా ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. కాశినాయన ఎస్ఐ యోగేంద్ర తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. వనపర్తి జిల్లా కృష్ణగిరి గ్రామానికి చెందిన శ్రీరాములు (26), వంకమర్రి గ్రామానికి చెందిన నాని వంకమర్రి గ్రామం నుంచి పోరుమామిళ్లకు బైక్‌పై వెళుతుండగా అదుపు తప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో నానికి తీవ్ర గాయాలు కాగా, శ్రీరాములు అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన నానిని ఆస్పత్రికి తరలించారు. శ్రీరాములు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆటో బోల్తా

– ఐదుగురికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన లావణ్య,ఆటోడ్రైవర్ ఓబయ్య

బి.కోడూరు : మండలంలోని మేకవారిపల్లె ఎస్సీ కాలనీకి చెందిన 15 మంది కూలీలు కూలి పనుల నిమిత్తం సోమశిల మండలం గోవిందాయపల్లె గామంలో వరినాట్లు వేసేందుకు ఆటోలో బయలుదేరారు. సోమవారం తెల్లవారుజామున బద్వేలు - పోరుమామిళ్ల ప్రధాన రహదారిలోని నక్కలగండి వద్ద ఆటో అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న 15 మందిలో ఐదుగురు కూలీలకు గాయాలయ్యాయి. వీరిలో భాగ్యమ్మ, లావణ్య, ఆదిలక్షుమ్మ, సునీత, ఆటోడ్రైవర్ ఓబయ్యకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనంలో బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో భాగ్యమ్మ, లావణ్యల పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కడపకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇలాగైతే ఎలాగండి!

- గండి ఆలయ అధికారి ఏకపక్ష ధోరణిపై విమర్శలు
- జర్మన్ షెడ్డు వేసేందుకు టీటీడీ నిరాకరణ
- పారిశుద్ధ్య సిబ్బందిని పంపేందుకూ అంగీకరించని వైనం
- రూ.15 లక్షలు ఆలయ ఆదాయానికి గండి

చక్రాయపేట : శ్రావణ మాస ఉత్సవాల సందర్భంగా గండి ఆలయ ప్రాంగణంలో ప్రతి యేటా వేసే జర్మన్ షెడ్డు ఈసారి సమస్యగా మారింది. దీనికి తోడు పారిశుద్ధ్య కార్మికుల సమస్య కూడా ఉత్సవాల్లో తలెత్తడంతో ఇబ్బందికర పరిస్థితులు నెల కొంటున్నాయి. ఇందుకు ఆలయ సహాయ కమిషనర్ ఒంటెద్దు పోకడే కారణమని పాలక మండలి, కూటమి నేతలు, పలువురు భక్తులు విమర్శిస్తున్నారు.

అధికారి అన్నీ తానే అని భావించడంతోనే..

ఉత్సవాల సందర్భంగా ఆలయ పాలక మండలి, సిబ్బంది కలిసి అధికార పార్టీకి చెందిన నేతల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి వారి ద్వారా టీటీడీ వారిని కలిసి జర్మన్ షెడ్డు, పారిశుద్ధ్య కార్మికులను ఏర్పాటు చేయించుకొనేవారు. కాని ఈ దఫా మాత్రం ఆలయ అధికారితో పాటు కాబోయే చైర్మన్ అని ప్రచారం చేసుకునే వ్యక్తి, ప్రధాన అర్చకుడు మాత్రమే నేరుగా టీటీడి అధికారులను కలసి జర్మన్ షెడ్డు, పారిశుద్ధ్య కార్మికులు కావాలని వినతి పత్రం ఇచ్చారు. దీనిపై స్పందించిన టీటీడీ ఈఓ ఆలయం దేవదాయ శాఖ పరిధిలో ఉంది. టీటీడీ ఎందుకు ఇవ్వాలి. దేవదాయ శాఖ తరపునే వాటిని సమకూర్చుకోవాలని లేఖ ద్వారా తెలియజేశారు. గతంలో శ్రావణ మాస ఉత్సవాలు అనగానే కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి ముందుగానే ఇక్కడి అధికారులను అప్రమత్తం చేసి తానూ ప్రత్యేక చొరవ చూపేవారు. దీంతో టీటీడీ వారు మారు మాట్లాడక నేరుగా వచ్చి జర్మన్ షెడ్డు వేసి పారిశుధ్య కార్మికులను ఇక్కడ వదిలి వెళ్లేవారు. నేడు అధికారి నేతల సహకారం తీసుకోనందునే ఇబ్బంది పడాల్సి వస్తోందని పలువురు భక్తులు ఆలయ అధికారి తీరును తప్పు పడుతున్నారు.

దిక్కుతోచక నేతల వద్దకు..

టీటీడీ అధికారులు జర్మన్ షెడ్డు, పారిశుధ్య కార్మికులను పంపడం లేదని చెప్పడంతో దిక్కుతోచక ఆలయ అధికారి కాబోయే చైర్మన్ సహకారంతో పులివెందుల నియోజకవర్గ టీటీడీ ఇన్‌చార్జి బీటెక్ రవిని కలిసి తమ ఇబ్బందిని వివరించారు. కానీ టీడీపీకి చెందిన స్థానిక ఎమ్మెల్సీ రామ గోపాల్‌రెడ్డిని కలిసి సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్ల లేదని ఆయన అనుచరులు ఆలయ సహాయ కమిషనర్‌పై మండి పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతిసారీ వైఎస్ అవినాష్ రెడ్డి చొరవతో జర్మన్ షెడ్డు, పారిశుధ్య కార్మికులు వస్తే నిరుడు జరిగిన శ్రావణ మాస ఉత్సవాల సమయంలో ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి చొరవ చూపడంతో వాటిని వేశారని కొందరు నేతలు పేర్కొంటున్నారు. ఈసారి ఎమ్మెల్సీని ఆలయ అధికారి ఖాతరు చేయక పోవడం వెనుక కారణం ఏమిటని పలువురు చర్చించుకుంటున్నారు.

జర్మన్ షెడ్ ఎందుకంటే..

ఉత్సవాల సందర్భంగా గండిలో ప్రతి యేటా టీటీడీ వారు వేసే విశాలమైన జర్మన్‌షెడ్డు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. వర్షం వస్తే అందులో సుమారు 2వేల మంది వరకు తలదాచుకొనేవారు. పైగా భక్తుల కాలక్షేపం నిమిత్తం సాంస్కృతిక కార్యక్రమాలు కూడా అందులోనే నిర్వహించేవారు.

పారిశుధ్య కార్మికులు లేకుంటే..

టీటీడీ తరపున వచ్చే పారిశుధ్య కార్మికులు నెల రోజుల పాటు ఉచితంగా ఆలయ ప్రాంగణంతో పాటు పాపాఘ్ని నదిని పరిశుభ్రంగా ఉంచే వారు. జర్మన్ షెడ్డుతో పాటు పారిశుధ్య కార్మికుల ఖర్చు టీటీడీ వారు భరించడంతో ఆలయ ఆదాయానికి గండి పడేది కాదు. నేడు టీటీడీ వారు మొండి చేయి చూపడంతో జర్మన్ షెడ్డుతో పాటు పారిశుధ్య కార్మికుల ఖర్చును ఆలయం నుంచి భరించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో రూ.15 లక్షల పైగా ఆలయ నిధులే ఖర్చు చేయక తప్పదు.

మా దృష్టికి రాలేదు..

జర్మన్ షెడ్డు, పారిశుధ్య కార్మికుల విషయం తన దృష్టికి కానీ, పాలక మండలి సభ్యుల దృష్టికి కానీ రాలేదు. సహాయ కమిషనర్ ఏమి చేస్తున్నాడో తెలియలేదు. చివరకు తానే జర్మన్ షెడ్, పారిశుధ్య కార్మికుల పరిస్థితి ఏంటని అడిగితే టీటీడీ వారు నిరాకరించారని వారు పంపిన లేఖను తనకు వాట్సాప్‌లో పంపారు. ఆయన ఒంటెద్దు పోకడల వల్లే ఇబ్బందులు ఎదురవుతున్నాయి.. అని ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ పేర్కొన్నారు.

ఆలయ అధికారి ఏమంటున్నారంటే..

టీటీడీ వారు జర్మన్ షెడ్డు, పారిశుధ్య కార్మికులను తాము ఇవ్వలేమని లేఖ పెట్టారు. వెంటనే బీటెక్ రవిని కలిసి పరిస్థితి వివరించాను. ఎమ్మెల్సీ రామ గోపాల్‌రెడ్డిని కూడా కలుస్తాము. ఆలయంలో చలువ పందిళ్ల టెండర్లు దక్కించుకున్న వారికైనా చెప్పి ఆలయ ఖర్చుతోనే షెడ్డు వేయించాలి. లేకుంటే ఇబ్బంది అవుతుంది. ఈ విషయాన్ని దేవదాయశాఖ మంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లాను.. అని ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య వివరించారు.


గండి వీరాంజనేయ స్వామి మూల విరాట్

ఉపకార వేతనానికి ఎంపికైన వారి వివరాలు నమోదు చేయాలి

కడప ఎడ్యుకేషన్ : గత ఏడాది డిసెంబర్ 8న జరిగిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో ఎంపికైన విద్యార్థులు 2025 ఆగస్టు 31వ తేదీలోపు తప్పకుండా ఢిల్లీ మానవ వనరులశాఖ వెబ్‌సైట్ నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ www.scholarships.gov.in లో నమోదు చేసుకుని దరఖాస్తు సమర్పించాలని డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. వన్‌టైమ్ రిజిస్ట్రేషన్(ఓటిఆర్)కు సంబంధించిన పూర్తి వివరాలు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ www.scholarships.gov.in లేదా ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్‌సైట్ www.bse.ap.gov.inl Z లో పొందుపర్చాలన్నారు.

ఫిర్యాదుదారులకు చట్ట పరిధిలో న్యాయం

– జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్ కుమార్

కడప అర్బన్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చిన ఫిర్యాదుదారులకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్ కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నిర్వహించారు. జిల్లా నలు మూలల నుంచి విచ్చేసిన ప్రజలతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 163 పిటీషన్‌లు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) కె. ప్రకాష్ బాబు, డి.టి.సి. డీఎస్పీ అబ్దుల్ కరీం తదితరులు పాల్గొన్నారు.

బౌలర్ల ధాటికి చతికిలబడ్డ బ్యాటర్లు

ప్రారంభమైన ఏసీఏ అండర్-16 మల్టీ డే మ్యాచ్‌లు


దినేష్, చిత్తూరు (6 వికెట్లు)


దేవాన్ష్, అనంతపురం (4 వికెట్లు)


కిరణ్‌కుమార్ అనంతపురం(4 వికెట్లు)


కాశ్యప్ రెడ్డి, కడప (5 వికెట్లు)


గైబు, కడప (8 వికెట్లు) 2 ఇన్నింగ్స్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్-16 మల్టీ డే మ్యాచ్‌లో తొలి రోజు సోమవారం వైఎస్ఆర్ఆర్ క్రికెట్ స్టేడియంలో అనంతపురం-చిత్తూరు జట్లు తలపడ్డాయి. ముందుగా టాస్ గెలిచిన అనంతపురం జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో అనంతపురం జట్టు 38.2 ఓవర్లలో 128 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని ఆదినారాయణ రెడ్డి 44 పరుగులు, సాత్విక్ 38 పరుగులు చేశారు.

చిత్తూరు జట్టులోని దినేష్ చక్కటి లైనప్‌లో అద్భుతంగా బౌలింగ్ చేసి 6 వికెట్లు తీశాడు. తేజేష్ 2 వికెట్లు, నిహాల్ మాలిక్ 2 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 50.5 ఓవర్లలో 184 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని మహ్మద్ షారుఖ్ అక్తర్ 81 పరుగులు చేశాడు. అనంతపురం జట్టులోని దేవాన్ష్ 4 వికెట్లు, కిరణ్ కుమార్ 4 వికెట్లు తీశారు

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో...

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో కడప- నెల్లూరు. జట్లు తలపడ్డాయి. ముందుగా టాస్ గెలిచిన కడప జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 29.3 ఓవర్లకు 78 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని గురు 25 పరుగులు చేశాడు. కడప జట్టులోని కాశ్యప్ రెడ్డి 5 వికెట్లు, గైబు 5 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 38.4 ఓవర్లకు 140 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని నాగ కిషోర్ 21 పరుగులు, చిన్నకేశవ 21 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని సుశాంత్ 3 వికెట్లు, ఎస్‌వీ చైతన్య 3 వికెట్లు తీశారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 19 ఓవర్లకు 3 వికెట్లు కోల్పోయి 73 పరుగులు చేసింది. కడప జట్టులోని గైబు 3 వికెట్లు తీశాడు. కడప బౌలర్ గైబు తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు తీయగా రెండవ ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు తీయడం విశేషం. దీంతో తొలి రోజు ఆట ముగిసింది.

తప్పుడు ప్రచారంపై చర్యలు తీసుకోవాలి


జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏపీయూడబ్ల్యుజే నాయకులు

కడప అర్బన్ : ఐన్యూస్ ఉమ్మడి కడప జిల్లా బ్యూరో చీఫ్ శ్రీనివాసులుతో పాటు ప్రొద్దుటూరు రిపోర్టర్ చెన్నయ్యపై నిరాధారమైన ప్రచారం చేసి వారి గౌరవానికి భంగం కలిగించిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీయూడబ్ల్యుజే జిల్లా అధ్యక్షుడు ఎం. బాలకృష్ణారెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు, రాష్ట్ర పూర్వ కార్యదర్శి పి.రామసుబ్బారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వెంకటరెడ్డి కోరారు. ఈ మేరకు వారు సోమవారం జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ తక్షణమే కేసు నమోదు చేసి వారం లోగా దర్యాప్తు పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని సంబంధిత పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యుజే నాయకులు మాట్లాడుతూ సంస్థకు తప్పుడు సమాచారంతో ఫిర్యాదులు చేయడమే కాకుండా, మహిళలను అందులో ప్రస్తావించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యుజే ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా గౌరవాధ్యక్షుడు భూమిరెడ్డి శ్రీనాథ్ రెడ్డి, ఐన్యూస్ బ్యూరో చీఫ్ శ్రీనివాసులు, ఏపీయూడబ్ల్యుజే నాయకులు సర్దార్, సుబ్బారెడ్డి, ఆంజనేయులు, నాగరాజు, శ్యామ్, వీరాంజనేయులు, భువనేశ్వర్ రెడ్డి, పూల వెంకటసుబ్బయ్య, చెన్నయ్య, నరసింహులు, సునీల్ కుమార్ పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి

ఏపీ ట్రాన్స్‌కో డైరెక్టర్ జేవీ రావు

కడప కార్పొరేషన్ : జిల్లాలో వ్యవసాయదారులకు, పరిశ్రమలకు అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని ఏపీ ట్రాన్స్‌కో డైరెక్టర్ జేవీ రావు అన్నారు. సోమవారం కడపలోని ట్రాన్స్‌కో నిలయంలో కడప, కర్నూలు, అనంతపురం, వైఎస్సార్ కడప ఉమ్మడి జిల్లా అధికారులతో ఆయన జోనల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రాన్స్‌కో ఇంజినీర్లు, ఏపీఎస్‌పీడీసీఎల్ ఇంజినీర్లతో సమన్వయం చేసుకొని విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. ఎక్కడైనా సమస్య తలెత్తినా త్వరగా మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని సూచించారు. ఏవైనా పరికరాలు కావాల్సి వస్తే కొనుగోలు చేయాలన్నారు. సంస్థ ఆదాయాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ డీవీ క్రిష్ణకుమార్, అన్ని జిల్లాల ఎస్ఈలు, డీఈలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీరభద్రయ్య జేవీ రావుకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

క్రైస్తవ సంక్షేమ పథకాల అమలెప్పుడు?

కడప రూరల్ : ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు లోకేష్ క్రైస్తవ సంక్షేమ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా పథకాలు అమలు కాలేదని ఏపీ పాస్టర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు మల్లెం విజయభాస్కర్, గౌరవాధ్యక్షుడు బిషప్ కె.శ్యాముల్‌బాబు అన్నారు. సోమవారం స్థానిక అశోక్‌నగర్‌లోని క్రైస్ట్ ప్రేయర్ చర్చిలో ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా పాస్టర్లకు, క్రైస్తవులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అందులో భాగంగా నూతన చర్చిల నిర్మాణం, కమ్యూనిటీ హాళ్లకు ఆర్థికసాయం అందజేస్తామన్నారని గుర్తు చేశారు. పాస్టర్ల గౌరవ వేతనాన్ని కొనసాగించడంతోపాటు ఆరోగ్య బీమా, మూడవ విడతగా గౌరవ వేతనం తదితర హామీలను అమలు చేస్తామని చెప్పారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటిందని, లోకేష్ మంత్రిగా బాధ్యతలను నిర్వర్తిస్తున్నారన్నారు. అయితే ఇంతవరకు ఆయన ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాకపోవడం శోచనీయమన్నారు. ఈనెల 29వ తేదీన ఏలూరులో ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి సమావేశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారు బిషప్ దేవన్న, ఉపాధ్యక్షులు బోనం ప్రభుదాస్, సంగటి జోసెఫ్, ఎద్దుల కుమార్, అరుణ్‌కుమార్, చార్లెస్ విజయకుమార్, హెబ్సిబా, భారతి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ చదువు మధ్యలో ఆపేసిన లేదా ఫెయిల్ అయిన వారికి 10th, ఇంటర్, డిగ్రీ diploma B.tech, BCA, MCA, MBA పాస్ అయ్యే ఛాన్స్ కలదు నాగేశ్ అకాడమీ కడప 7569470023

B.Sc. (నర్సింగ్) అడ్మిషన్స్

■ AP NCET (నర్సింగ్)లో ర్యాంక్ వచ్చిన స్టూడెంట్స్ కి B.Sc. (Nursing) నందు. ఫ్రీ ఎడ్యుకేషన్ కలదు. ఫ్రీ హాస్టల్ కలదు. Cont:- G.MURALI, 9030661651, ATP.

REAL ESTATE

PLOT FOR SALE

■ తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డు రోడ్డుకు 2వ ప్లాటు (రాస్ బిల్డింగ్ దగ్గర) 100 అంకణముల సెమి కమర్షియల్ ప్లాటు అమ్మబడును. సంప్ర: 95154 83527.

SERIVCES

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ ఫైనాన్స్ లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్/ షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్ ట్రేడింగ్ కం. ఫోన్ 7382114847

PERSONAL CARE

CHANGE OF NAME

■ I KOTHAPALLI ZABIA (OLD NAME) R/O D.NO:-21/365, KHM STREET, PRODDATUR (TO & MA), YSR (DI), AP. NOW I CHANGED MY NAME AS ZABIA SHAIK (NEW NAME) W/O SHAIK MOHAMED ASHFAAQ

LOST

■ PASSPORT NO :- V6136075. Dt 26.04.2021. Issued by The Regional Passport Office. Kuwait. SHAIK JAVID BASHA, S/O SHAIK MAHABOOB BASHA. R/at. D.NO:- 4/448, GADDI STREET, RAJAMPET (TOWN & MDL), ANNAMAYYA (DIST), A.P .అను నెంబరు, చిరునామా కలిగిన పాసుపోర్టు రాయచోటి బస్టాండ్ నందు ఎక్కడో జారిపోయినది దొరికిన వారు పై చిరునామాకు తెలుపగలరు

WANTED

■ Airtel Wifi కడప, ప్రొద్దుటూరు పట్టణం నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం.18500 to 25000 + ఇన్సెంటివ్ ఆండ్రాయిడ్ ఫోన్+ బైక్+ డ్రైవింగ్ లైసెన్స్ ఉండవలెను Gopalakrishna -7799772678

■ పేషెంట్స్ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.7993583999

■ కడప సమీపంలోని రామన్నపల్లెలో బెంగాల్ మేకలు చూసుకోవడానికి అనుభవం గల గొల్లవారు కావలెను సంప్రదించండి: 8247584286

■ SBI లో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేయుటకు, BREలు, కలెక్షన్ Executiveలు, వెరిఫికేషన్ ఆఫీసర్లు, అటెండర్లు కావలెను. అన్నిరకాల బ్యాంకు ఉద్యోగాలకు ✆ 9121278009, 9849848817

■ తిరుమల తిరుపతి నందు కాంట్రాక్ట్ పద్ధతిలో సూపర్‌వైజర్లు, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, అటెండర్, కంప్యూటర్ ఆపరేటర్లు కావలెను. అన్ని రకాల ఉద్యోగాలకు ✆ 9121278009, 9959966708

■ స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం (VJA) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు 10th ఆపై చదివి, Age: 20-30 కలిగిన (M/F) వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్: 5000 ✆ 9959021122, 9959031122

■ 'కేపిటల్ బిట్స్ రాజంపేట, పీలేరు బ్రాంచి యందు బిజినెస్ ఎగ్జిక్యూటివ్ / కలెక్షన్ ఇన్చార్జి గా పని చేయుటకు 10th, ఆపైన చదివిన, వయస్సు : 19-30 సంవత్సరాలు కలిగిన అభ్యర్థులు కావలెను. జీతం : 18,000/-,నం'రానికి 3,000/- ఇంక్రిమెంట్ + ఇన్సెంటివ్ + బోనస్ Ph :(రాజంపేట) : 809891 2207 (పీలేరు) : 9505507125, 9848312025

■ WANTED URGENT ABU-MUAAZ haji umrah tours & travels నందు పనిచేయుటకు, sales executives, packing helpers, కావలెను. Interview :22-07- 2025 (మంగళవారం) time : 8:00 am. సంప్రదించవలసిన అడ్రస్: shahimahal marriage hall, beside taiyab college, ramarajupalli, kadapa. Cel :9866446602, 6302345565

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409

గమనిక

దర్జాగా ప్రభుత్వ భూమి కబ్జా

- అట్లూరు మండలంలో అంతులేని ఆక్రమణలు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు


భూమిని చదును చేసిన దృశ్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అధికార పార్టీ నేతల భూ కబ్జాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. బద్వేలు నియోజకవర్గ పరిధిలో ఎక్కడ ప్రభుత్వ భూమి కనిపిస్తే అక్కడ వాలిపోతున్నారు తెలుగు తమ్ముళ్లు. అట్లూరు మండల పరిధిలోని మాడపూరు రెవెన్యూ పొలం సర్వే నంబరు 1039లో 11.45 ఎకరాలు(పదకొండు ఎకరాల 45 సెంట్లు విస్తీర్ణం) ప్రభుత్వ భూమి ఉంది. ఇది మంచి సారవంతమైన భూమి కావడంతో పాటు బద్వేలు-ముత్తుకూరు రోడ్డుకు సమీపంలో ఉండడంతో ఆ భూమికి విలువ బాగా ఉంది. దీంతో ఆ భూమిపై కన్నేసిన కోనరాజుపల్లికి చెందిన టీడీపీ నాయకుడు గత ఏడాది కబ్జాకు యత్నించారు. అయితే రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఆదివారం సెలవు దినం కావడంతో ఆయనకు కలిసి వచ్చింది. డోజర్లు, జేసీబీ యంత్రాలతో ఆ భూమిని శనివారం రాత్రి నుంచి చదును చేయడం మొదలుపెట్టారు. రెవెన్యూ అధికారులు టీడీపీ నాయకుడితో కుమ్మక్కయ్యారో ఏమో అటు వైపు కన్నెత్తి కూడా చూడకపోవడం మండల ప్రజలను విస్మయానికి గురి చేస్తోంది.

హెచ్చరిక బోర్డును లెక్క చేయని వైనం..

మాడపూరు రెవెన్యూ పొలంలోని సర్వే నెంబరు 1039లో 11.45 ఎకరాలు విస్తీర్ణం ప్రభుత్వ స్థలమని, ఆక్రమిస్తే చర్యలు తప్పవని రెవెన్యూ అధికారులు గతంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అయితే ఆ బోర్డు తమకు కాదనుకున్నారో ఏమో బోర్డును సైతం లెక్క చేయకుండా ఆక్రమించేశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే గతంలో కబ్జాకు గురైన స్థలాలను కబ్జాదారుల చెర నుండి విముక్తి కల్పిస్తామని ప్రగల్భాలు పలికారు నియోజక వర్గ నేతలు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి వారి అనుచరులే బద్వేలు నియోజకవర్గంలో కబ్జాలకు పాల్పడడం పరిపాటిగా మారింది.

చర్యలు తీసుకుంటాం

మండల పరిధిలోని సర్వే నంబరు 1039లో విలువైన ప్రభుత్వ భూమిని టీడీపీ నాయకుడు కబ్జా చేసిన విషయమై తహసీల్దార్ సుబ్బలక్షుమ్మ సెలవులో ఉండటంతో ఆర్ఐ రమణను ఫోన్‌లో వివరణ కోరగా ఆదివారం ఆ భూమిలో యంత్రాలతో చదును చేస్తున్నట్లు సమాచారం అందిందని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ ఆదేశాల మేరకు సిబ్బందితో కలసి అక్కడకు వెళ్లామన్నారు. అప్పటికే అక్కడ ఎవరూ లేరని భూమి మాత్రం చదును చేశారన్నారు. పూర్తి విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అది పరువు హత్యేనా?

- వీడనున్న బాలిక హత్య మిస్టరీ!
- అన్ని కోణాల్లో దర్యాప్తు
- నేడో రేపో నిందితుల వివరాలు వెల్లడించనున్న పోలీసులు


గండికోటలో హత్య సంఘటనను పరిశీలించేందుకు వచ్చిన డీఐజీ(ఫైల్‌ఫోటో)

జమ్మలమడుగు : గండికోటలో సంచలనం సృష్టించిన బాలిక హత్య కేసు మిస్టరీని ఎట్టకేలకు పోలీసులు ఛేదించినట్లు తెలిసింది. నిందితులను గుర్తించినట్లు సమాచారం. చిన్న చిన్న సాంకేతిక అడ్డంకులు ఉండటంతో నిందితుల వివరాలు వెల్లడించలేకపోతున్నారని తెలుస్తోంది. ఈనెల 15వ తేదీన ప్రొద్దుటూరుకు చెందిన వైష్ణవి అనే 17 ఏళ్ల బాలిక గండికోటలో హత్యకు గురైన విషయం విదితమే. తమ కూతురు కనిపించలేదంటూ బాలిక తల్లిదండ్రులు ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో 14వ తేదీ ఫిర్యాదు చేశారు. గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు గండికోటలోని రంగనాథస్వామి ఆలయం వెనుకవైపు మరుసటి రోజు బాలిక మృతదేహాన్ని గుర్తించారు.

లోకేష్‌ను అనుమానించి...

బాలికను ప్రొద్దుటూరు నుంచి లోకేష్ అనే యువకుడు ఈనెల 14వతేదీ సోమవారం ఉదయం గండికోటకు బైక్‌పైన తీసుకువచ్చాడు. తిరిగి రెండు గంటల తర్వాత బైక్‌పైన ఒక్కడే వెళ్లిపోయాడు. హత్యచేసింది లోకేష్‌గానే మొదట పోలీసులు భావించారు. తర్వాత పోలీసులు గండికోట ప్రాంతంలో పూర్తిగా విచారించడంతో పాటు సీసీ కెమెరాలను పరిశీలించారు. లోకేష్ వెళ్లిపోయిన తర్వాత కూడా బాలిక గండికోటలో సంచరించిందనే నిర్ధారణకు వచ్చారు. దీంతో లోకేష్ పాత్ర లేదని పోలీసులు తేల్చారు. ఈ నేపథ్యంలో హత్య కేసు మృతురాలి కుటుంబ సభ్యుల వైపు మళ్లింది.

సురేంద్ర ప్రవేశంతోనే..

బాలికకు సంబంధించిన ప్రేమ వ్యవహారాన్ని పెద్దనాన్న కుమారుడైన సురేంద్రనే డీల్ చేస్తూ వచ్చాడు. అతను లోకేష్‌ను అనేక సార్లు మందలించాడు. అయితే 14వతేదీన బాలిక కాలేజికి రాలేదని యాజమాన్యం తల్లికి ఫోన్ చేయడంతో ఎక్కడికి వెళ్లిందని ఆరా తీశారు. బాలిక స్నేహితులు గండికోటకు వెళుతున్నట్లు తమతో చెప్పిందని సురేంద్రకు తెలపడంతో లోకేష్‌తో వెళ్లిందని నిర్ధారణకు వచ్చారు. వెంటనే సురేంద్ర గండికోటకు వచ్చి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు.

అక్కడ ఏం జరిగింది..

విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు.. సోమవారం బాలిక లోకేష్‌తో గండికోటకు వెళ్లింది. తనకోసం వస్తున్నారనే సమాచారం తెలుసుకున్న లోకేష్ బాలికను అక్కడే వదిలేసి ఉదయం 10:40 నిమిషాలకు గండికోటనుంచి బయటకు వచ్చేశాడు. ఆ తర్వాత సురేంద్ర గండికోటకు వెళ్లాడు. బాలిక కోసం గండికోటలో వెతుకుతున్న అతనికి ఆమె రంగనాథస్వామి ఆలయం సమీపంలో కనిపించింది. తన కోసమే వస్తున్నాడని భావించి ఆమె పరుగులు తీసింది. ఆ సమయంలో ఆమె కాలికి ఉన్న చెప్పులు రెండు చోట్ల పడిపోయాయి. రంగనాథస్వామి ఆలయం వెనుకవైపు బాలికను చిక్కించుకుని తీవ్రంగా కొట్టడంతో కాలేయం దెబ్బతిని మరణించింది. బాలిక హత్యను లోకేష్ వైపు మళ్లించడం కోసం ఆమె శరీరంపై ఉన్న పంజాబీ డ్రస్సును తొలగించినట్లు పోలీసులు భావిస్తున్నారు. మొత్తం మీద బాలిక హత్య కేసులో కుటుంబ సభ్యులపైనే బలంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కుమార్తె చనిపోయిందన్న బాధ వారిలో ఏ కోశానా లేదని, పైగా హత్య జరిగిన ప్రదేశాన్ని మొదట వారే గుర్తించి తమకు తెలపడం, సురేంద్ర గండికోటలో పర్యటించిన సమయంలోనే ఈ హత్య జరిగినట్లు తేలడం.. ఈ అన్ని కారణాల రీత్యా కుటుంబ సభ్యుల ప్రమేయం ఇందులో ఉందనే నిర్ధారణకు పోలీసులు వచ్చినట్లు తెలుస్తోంది. పోలీసులు సోమవారం కుటుంబ సభ్యులను జమ్మలమడుగులోని పోలీసు స్టేషన్‌కు విచారణ నిమిత్తం తీసుకువచ్చారు. ఒకటి రెండు రోజుల్లో నిందితుల వివరాలను మీడియాకు వెల్లడించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

రెండు ఇళ్లలో చోరీ

7.7 తులాల బంగారు నగలను దోచుకెళ్లిన దొంగలు


నేతాజినగర్‌లో బాధితులతో మాట్లాడుతున్న సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ సంజీవరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులోని నేతాజినగర్‌లో ఏక కాలంలో రెండు ఇళ్లలో చోరీ జరిగింది. సత్యాల దస్తగిరి, పఠాన్ గైబూసాహెబ్ ఇళ్లలో సుమారు 7.7 తులాల బంగారు నగలను దొంగలు దోచుకెళ్లారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సత్యాల దస్తగిరి ఇంట్లో విద్యుత్ లేకపోవడంతో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత సమీపంలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లి పడుకున్నారు. అలాగే పఠాన్ గైబూసాహెబ్ కుటుంబ సభ్యులతో కలిసి రెండు రోజుల క్రితం కర్నాటక రాష్ట్రంలోని దాదాపహాడ్‌కు వెళ్లారు. ఈ క్రమంలో దొంగలు రెండు ఇళ్లకు వేసిన తాళాలను పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. నేతాజినగర్-4లోని దస్తగిరి ఇంట్లో 5 తులాలు, నేతాజినగర్-2లోని గైబూసాహెబ్ ఇంట్లో 27 గ్రాముల బంగారు, 600 గ్రాములు వెండి నగలను దోచుకెళ్లారు. సోమవారం వేకువ జామున 2.40 గంటల సమయంలో చోరీ జరిగినట్లు అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. వన్‌టౌన్ సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ సంజీవరెడ్డిలు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.